క్లుప్తంగా

పాదరక్షలు పంపిణీ

మెంటాడ: మండలంలోని చల్లపేట పీహెచ్‌సీలోని ఆరుగురు కుష్టు, ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు ఎంపీడీఓ కె.భానుమూర్తి గురువారం పాదరక్షలు పంపిణీ చేశారు. ఈ చెప్పులను లెప్రా సొసైటీ సమకూర్చింది. లెప్రా సొసైటీ ప్రతినిధి మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తుల కోసం జిల్లా కేంద్రంలో ప్రత్యేక ఆస్పత్రి ఉందని చెప్పారు. వ్యాధి నిర్ధారణ నుంచి చికిత్స వరకు అన్ని వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు.వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

రేగిడి: మండలంలోని వావిలవలస, అంబఖండి, సోమరాజుపేట, లింగాలవలస, తాటిపాడు తదితర గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను ఏపీఓ ఎస్.హరనాథ్ గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన వేతనదారులతో మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం వేగంగా, మధ్యాహ్నం ఎండతగ్గిన తర్వాత పనులకు హాజరు కావాలని సూచించారు. జాబ్ కార్డులు ఉన్నవారే పనులకు రావాలని చెప్పారు. ఉపాధి పనుల వద్ద ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు.

వంగర ఏఓగా సోమశేఖర్


నూతలపాటి సోమశేఖర్

వంగర: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఏఓగా నూతలపాటి సోమ శేఖర్ గురువా రం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ ఏఓగా పనిచేసిన లోపింటి త్రినాథ్ పదో న్నతిపై చీపురుపల్లి ఎంపీడీఓగా వెళ్లారు. ఆయన స్థానంలో హిరమండలం మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన సోమశేఖర్ ఇక్కడికి వచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బాడంగి: మండలంలోని గజరాయునివలస 33/11కేవీ పరిధి గ్రామాలకు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటన లో తెలిపారు. విద్యుత్ లైన్లను ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.బాడంగి,డొంకినవలస, రైల్వేస్టేషన్, ముగడ న్యూకాలనీ, మల్లంపేట గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎరువుల లారీ బోల్తా


పంట పొలాల్లో బోల్తాపడిన ఎరువుల లారీ

వంగర: మండలంలోని కొప్పరవలస–రుషింగి గ్రామాల మధ్య గురువారం ఓ ఎరువుల లారీ అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాలు కొప్పరవలస గ్రామం నుంచి రుషిం గి మీదుగా వీరఘట్టం వైపు వెళుతున్న లారీ భారీలోడ్ కారణంగా పంటపొలాల్లో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదానికి సంబంధించి తమకు ఎలాంటి సమాచారం అందలేదని ఎస్‌ఐ షేక్ శంకర్ తెలిపారు.

ఉద్యానవన పంటల సాగుకు ప్రోత్సాహం

మెంటాడ: ఉద్యానవన పంటల సాగుకు ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని ఉపాధి హామీ పథకం ఏపీఓ చిన్నప్పయ్య గురువా రం ఓ ప్రకటనలో తెలిపారు. పండ్ల తోటలు, పూలతోటలు సాగు చేసేందుకు రైతులకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. 25 సెంట్ల నుంచి 5 ఎకరాల లోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులతో పాటు ఎస్సీ,ఎస్టీ రైతులు అర్హులని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్న రైతులు తమ దరఖాస్తులను ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌కు కానీ, మండల పరిషత్ కార్యాలయంలో కానీ అందించాలని సూచించారు. దరఖాస్తుకు పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకు పాసు పుస్తకం, ఆధార్ కార్డు ,జాబ్ కార్డులను జతచే యాలని, అలాగే ఏ పంటను సాగు చేయాలనుకుంటున్నారో వివరాలను పొందుపరచాలని పేర్కొన్నారు.

యోగాపై విస్తృతంగా ప్రచారం చేద్దాం

బొబ్బిలిరూరల్: యోగా వల్ల కలిగే ప్రయోజనాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేద్దామని కోమటిపల్లి ఆయుర్వేద ఆస్పత్రి వైద్యురాలు కనకమహాలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పి.రవికుమార్, ఇతర అధికారులతో గురువారం ఆమె సమావేశమయ్యారు.యోగా మాసోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజూ భారతీయ సంస్కృతిలో యోగాకు ప్రత్యేక స్థానాన్ని మన పూర్వీకులు కల్పించారని, యోగా విద్యను అభ్యసిస్తే మానసిక స్థిరత్వంతో పాటు రోగాలు రాని శరీరాన్ని నిర్మించుకోవచ్చన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ అల్లు భాస్కరరావు,ఏఓ అప్పారావు,యోగా శిక్షకురాలు పాల్గొన్నారు.


బాడంగి: ఎరుకులపాకలలో పూజలందుకుంటున్న హనుమాన్


సంతకవిటి: మందరాడలో పూజలందుకుంటున్న హనుమాన్

వైభవంగా హనుమాన్ జయంతి

హనుమాన్ జయంతి వేడుకలను బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని పట్టణాలు,పల్లెల్లో గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే ఆంజనేయస్వామి ఆలయాలకు భక్తులు క్యూ కట్టారు. అర్చకులు భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయాల వద్ద భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీలు తగిన ఏర్పాట్లు చేశాయి. పలు ఆలయాల వద్ద భక్తులకు తాగునీరు, మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. కొన్ని చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. బొబ్బిలిలో హనుమాన్ దీక్షా సేవా సమితి ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్రలో భాగంగా భారీ బైక్ ర్యాలీ చేశారు. ఈ ర్యాలీని ఎమ్మెల్యే బేబీ నాయన జెండా ఊపి ప్రారంభించారు. బొబ్బిలి మండలంలోని పక్కి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు పూజలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


సంతకవిటి: వాల్తేరులో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు


బొబ్బిలిరూరల్: పక్కి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు,భక్తులు


రాజాం సిటీ: అమ్మవారికాలనీలోని ఆలయంలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు


రేగిడి: ఉంగరాడమెట్ట వద్ద హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


బాడంగి: పిన్నవలసలలో పంచముఖాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు


మెంటాడ: కుంటివలసలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు


రామభద్రపురం: రామభద్రపురం బైపాస్ రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు,భక్తులు


రాజాం: రాజాం పట్టణంలోని చీపురుపల్లి రోడ్డులో దాసాంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు


బొబ్బిలి: బొబ్బిలిలో హనుమాన్ దీక్షా సేవా సమితి ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ


వంగర: నీలయ్యవలసలో పూజలు చేస్తున్న భక్తులు

రికార్డులు పక్కాగా నిర్వహించాలి


తెర్లాం: తెర్లాం సచివాలయం-1లో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాంబాబు


వంగర: అరసాడలో చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రఘునాథాచారి

తెర్లాం: గ్రామ సచివాలయాల్లో రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని ఎంపీడీఓ రేగి రాంబాబు అన్నారు. మండల కేంద్రంలోని గ్రామసచివాలయం-1లో గురువారం ఆయన తనిఖీలు నిర్వహించారు. ఉద్యోగుల హాజరు, ఇతర రికార్డు లను, కొత్త రేషన్ కార్డుల కోసం అందిన దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది అంతా సమయపాలన పాటించాలని, ప్రజలు అందించే అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని సూచించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ నీలిమ, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున, తదితరులు ఉన్నారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు

వంగర: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి హెచ్చ రించారు. అరసాడ గ్రామ సచివాలయం, పీహెచ్‌సీలో గురువారం ఆయన తనిఖీలు చేశారు. సచివాలయంలో రికార్డులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను వేగవంతం చేయాలని, ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందే అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలన్నారు. పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లా డుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్ లచ్చుభుక్త సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులున్నారు.

ఘనంగా రామాలయ ప్రతిష్ఠోత్సవాలు

తెర్లాం: మండలంలోని మోదుగువలస గ్రామంలో రామాలయ ప్రతిష్ఠోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులతో వేదపండితులు ప్రత్యేక పూజలు చేయించారు. ఉత్సవా లకు హాజరైన వైఎస్సార్‌సీపీ బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుకు గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు సాదర స్వాగతం పలికారు. ఆయ నతో వేదపండితులు సీతారాములకు పూజలు చేయించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సీని యర్ నాయకుడు శంబంగి వేణుగోపాలనాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ ప్రతినిధి గర్బాపు రామారావు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

జీవనోపాధిపై దెబ్బకొట్టొద్దు

రామభద్రపురం: అవినీతికి తావులేకుండా ఇంటింటికీ రేషన్ సరుకులు అందిస్తున్న తమ జీవనోపాధిపై దెబ్బకొట్టొద్దని,తమను కొనసా గించాలని కోరుతూ మండల ఎండీయూ వాహనాల ఆపరేటర్లు,హెల్పర్లు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యా లయంలో తహసీల్దార్ సులోచన రాణిని గురువారం కలిసి వినతపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రభుత్వ సాయంతో వాహనాలను తీసుకున్నామని, అవినీతికి ఆస్కారం లేకుండా ఇంటింటికీ రేషన్ సరుకులను అందిస్తున్నామ న్నారు. ఎండీయూ వాహనాలను మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు క్షుణ్ణంగా పరిశీలించి అనుమతించారని, తూనికల కొలతల శాఖ అధికారులు వేయింగ్ మెషిన్లను తనిఖీ చేసిన తర్వాతే ప్రజలకు రేషన్ సరుకులు అందిస్తున్నామని పేర్కొన్నారు. వాహనాలు కొనసాగించకుంటే కుటుంబ పోషణ లేక రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తంచేశారు. 2027 వరకు ఒప్పంద గడువు ఉందని అప్పటి వరకు తమను కొనసాగించాలని కోరారు. మండల ఎండీయూ వాహన ఆపరేటర్ల అధ్యక్షుడు ఎస్.కృష్ణ, బి.గణేష్, చొక్కాపు తిరుపతిరావు, ఎన్ రాఘవేంద్ర, శ్రీనివాసరావు, గణేష్, సూర్యరావు, ఎక్కుడు సురేష్, కోట రామకృష్ణ పాల్గొన్నారు.


తహసీల్దార్ సులోచనరాణికి వినతిపత్రం అందిస్తున్న ఎండీయూ వాహన ఆపరేటర్లు

వన్నలిలో వైద్య శిబిరం

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి సోహినీ రాఘవ్ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన గ్రామస్తులకు 14 రకాల వైద్య పరీక్షలు చేశారు. అవసర మైన వారికి మందులు అందజేసి, ఆరోగ్య జాగ్రత్తలను సూచించారు.ఎంఎల్‌హెచ్‌పీ ప్రియ, ఏఎన్ఎం రాజేశ్వరి, సర్పంచ్ గార రమణ, ఆశ వర్కర్లు రాములమ్మ, సావిత్రి, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ రాఘవ్, సిబ్బంది

లెప్రసీ సర్వే

బొబ్బిలిరూరల్: పిరిడి గ్రామంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రఘువంశీ ఆధ్వర్యంలో లెప్రసీపై వైద్యసిబ్బంది గురువారం ఇంటింట సర్వే చేశారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి మంచానికే పరిమితమైన దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు చికిత్స చేసి, కుష్టు వ్యాధి లక్షణాలను పరిశీలించారు. వైద్యాధికారి మాట్లాడుతూ శరీరంపై స్పర్శ లేని మచ్చలు ఉంటే కుష్టు వ్యాధి కావచ్చని చెప్పారు. ప్రభుత్వం అన్ని పీహెచ్‌సీల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయిస్తుండడంతో పాటు ఉచితంగా మందులు అందిస్తోందని చెప్పారు.లక్షణాలున్న వారు చికిత్స తీసుకుంటే వ్యాధి నయమవుతుందని,అపోహలతో రోగాన్ని దాచి ఉంచరాదని అవగాహన కల్పించారు.


పిరిడిలో వృద్ధుడికి వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ వంశీ

నిబంధనలకు వ్యతిరేకంగా పుస్తకాల విక్రయాలు

బొబ్బిలి: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పుస్తకాలు, యూనిఫాం దుస్తులను విక్రయిస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలపై విద్యా శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకు లతో కలిసి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొన్ని విద్యాసంస్థలు తమ వద్దే పుస్తకాలు, యూనిఫాం దుస్తులు కొనుగోలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నాయని, పట్టణంలోని ప్రైవేటు విద్యాసంస్థలన్నీ ఇదే విధానాన్ని పాటిస్తు న్నాయని అన్నారు.ఇప్పటికే ఫీజులు ఎక్కువ కావడంతో పాటు అమ్మ వడి డబ్బులు తల్లుల ఖాతాల్లో పడకపోవడంతో అవస్థలు పడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఇదో గుదిబండగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పైపెచ్చు సాధారణ ధరలకు బయట దొరికే పుస్తకాలు కొనుగోలు చేస్తే పాఠశాలల్లోకి అనుమతించబోమని యాజమాన్యాలు బెదిరించడం దారుణమన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎం.యుగంధర్,ఎస్ గణేష్, ఎం.శ్రీకాంత్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్రావణ్‌కుమార్,తదితరులు

సేంద్రియ ఎరువుతో పంటకు మేలు

రేగిడి: వేసవిలో పొలాల్లో సేంద్రియ ఎరువుతో పాటు చెరువు మట్టిని వేయడం వల్ల ఖరీఫ్‌లో సాగు చేసే పంటలకు ఎంతో మేలు జరుగుతుందని ఏఓ జి.మురళీకృష్ణ అన్నారు. మండలంలోని ఖండ్యాం, చిన్నశిర్లాం, పెద్దశిర్లాం, అంబాడ, వెంకటాపురం గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసంద ర్భంగా రైతులకు వివిధ పంటల సాగుపై అవగాహన కల్పించారు. సాగులో వ్యవసాయ సిబ్బంది సూచనలు, సలహాలను పాటించాలని చెప్పారు. ఖరీఫ్ పంటల సాగుకు సమాయత్తంపై రైతులకు సలహాలు, సూచనలు చేశారు.


ఖండ్యాంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మురళీకృష్ణ

రెవెన్యూలో అధిక వినతులకు అధికారులే కారణం

- వారంలోగా వినతులు పరిష్కరించి, భూసర్వేను వేగవంతం చేయాలి
- సీసీఎల్‌ఏ సమీక్షలో జిల్లా వెనుకబాటు
- నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో జేసీ సేతుమాధవన్

బొబ్బిలి:

కలెక్టరేట్‌కు ప్రతీ సోమవారం వచ్చే వినతుల్లో 90 శాతం రెవెన్యూ శాఖకు సంబంధించినవే ఉంటున్నాయని, ఇందుకు రెవెన్యూ అధికారులు, సిబ్బందే కారణమని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అన్నారు. గురువారం సాయంత్రం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో బొబ్బిలి నియోజకవర్గానికి సంబంధించిన అన్ని శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సర్వే, రెవెన్యూకు సంబంధించిన వినతులను వారం రోజుల్లోగా పరిష్కరించాలని నాలుగు మండలాల అధికారులను ఆయన ఆదేశించారు.

వచ్చే వారం నుంచి వినతులు కలెక్టరేట్ వరకూ మళ్లీ వస్తే సంబంధిత వీఆర్‌ఓలపై చర్యలుంటాయని హెచ్చరించారు. ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణపై గ్రామాల్లో ప్రచారం చేపట్టాలని, ఆక్రమణదారులతో దరఖాస్తులు చేయించాలని, వీఆర్ఓలను క్షేత్రస్థాయిలో ఇంటింటికీ పంపించాలని తహసీల్దార్‌లను ఆదేశించారు. రెండు రోజుల్లో అన్ని గ్రామాల్లో పర్యటించి ఆక్రమణల వివరాలు నమోదు చేయాలని చెప్పారు. అందరికీ ఇళ్లు పథకంలో జిల్లా వ్యాప్తంగా 6వేల దరఖాస్తులు అందాయని, అన్నింటినీ పరిశీలించి శనివారం నాటికి ఆన్‌లైన్ చేయాలన్నారు. రీసర్వేలో జరిగిన తప్పిదాలను సవరించాలని దిశానిర్దేశం చేశారు. డాక్యుమెంట్లను పరిశీలించకుండానే వెబ్‌లాండ్‌లో పేర్లు నమోదు చేయడం వల్ల పొజిషన్ సర్టిఫికెట్లలో తేడాలొస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రీసర్వే వినతులపై మండలాల వారీగా జాబితా ఇస్తామని, వారంలోగా మొత్తం అర్జీలను పరిష్కరించాలన్నారు.


హాజరైన తహసీల్దార్‌లు, డీటీలు, సర్వేయర్లు


సమీక్ష నిర్వహిస్తున్న జేసీ సేతు మాధవన్, ఆర్డీఓ రామమోహనరావు

రూ.10 కోట్లకు రూ.53 వేలే వసూలు..!

జిల్లా వ్యాప్తంగా నీటి తీరువా పన్నురూ.10 కోట్ల వరకు వసూలు కావాల్సి ఉంటే కేవలం రూ.53 వేలే వసూలు కావడం సరికాదని జేసీ సేతు మాధవన్ సిబ్బందిపై ఆగ్ర హం వ్యక్తం చేశారు. ఇక నుంచి ప్రతీ వారం టార్గెట్‌లు విధిస్తామని, ప్రతి ఒక్కరూ లక్ష్యాలు చేరుకోవాల్సిందేనన్నారు. ప్రతీ వారం సమీక్షిస్తామని, వెంట వెంటనే ఆన్ లైన్ చేయాలని చెప్పారు. భూ పరిపాలన శాఖ (సీసీఎల్‌ఏ)నిర్వహించే సమీక్షలో మన జిల్లా వెనుకబడి ఉందన్నారు. సిబ్బంది పనితీరు, సమర్థతను ఆధారంగా చేసు కుని బదిలీలు చేపడతామని స్పష్టం చేశారు. సిఫార్సులను ఆమోదించబోమన్నారు. సిఫార్సులు చేయిస్తే చర్యలు తప్పవన్నారు. ఆర్డీఓ జె.వి.ఎస్.ఎస్. రామమోహనరావు, సర్వే ఏడీ రమణమూర్తి, నాలుగు మండలాల తహసీల్దార్‌లు, సర్వేయర్లు, డీటీలు, వీఆర్‌ఓలు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు సహకరించండి

వంగర: సారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రాజాం ఎక్సైజ్ శాఖ ఎస్‌ఐ జి.మాన్యాలు కోరారు. నవోదయం2.0 కార్యక్రమంలో భాగంగా వి.వి.ఆర్.పేట పంచాయతీ జె.కె.గుమ్మడ గ్రామంలో గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామం సారా రహితంగా ఉండాలని అన్నారు. సారా తాగడం వల్ల ఆరోగ్యం పాడవుతుందని, బతుకులు చిన్నాభిన్నమవుతాయని వివరించారు. మత్తుకు చిత్తు కావొద్దని, సారాకు బలికావొద్దని అన్నారు. సారా తయారు చేసినా, విక్రయించినా కేసులు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో గతంలో సారా తయారీ చేసిన వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. సర్పంచ్ బత్తిన గురువులు, వైఎస్సార్‌సీపీ ఉపాధ్యాయ విభాగం జిల్లా అధ్యక్షుడు మరిచెర్ల గంగారావు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్‌ఐ మాన్యాలు